7న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కాచిగూడ, నవంబర్ 30 : 2024 సంవత్సరంలో డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో 80 శాతం మార్కులు సాధించిన తెలంగాణ వ్యాప్తంగా అనాథ మున్నూరు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఆర్థికసాయాన్ని అందజేయనున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకట్రావు శనివారం తెలిపారు. తల్లిదండ్రులు, సంరక్షకుల్ని కోల్పోయిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఈనెల 7న ఉదయం 11 గంటలకు కాచిగూడలోని మున్నూరు కాపు సంఘంలో అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. పూర్తి వివరాలకు 040-24658160, 9491627404 లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ట్రస్టీలు పి.విష్ణువర్ధన్, శ్రీనివాస్‌రావు, నగేశ్, దేవేందర్, చంద్రశేఖర్, రాఘవేందర్ ఉన్నారు.

నేడు పద్మశాలి సంఘం కార్తిక వనభోజనాలు

అంబర్‌పేట,నవంబర్ 30: అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నేడు ఉస్మానియా యూనివర్సిటీలోని ఫ్యాకల్టీ క్లబ్‌లో కార్తిక వన భోజనాలు, పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, కార్యదర్శి శివకుమార్, కోశాధికారి బి.అశోక్ తెలిపారు. వనభోజనాలకు ముఖ్యఅతిథులుగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్‌భాస్కర్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు రాన్నుట్లు తెలిపారు. పద్మశాలి కుటుంబసభ్యులంతా ఉదయం 10 గంటలకు హాజరు కావాలని వారు కోరారు.

ఫోన్లు అప్పగింత

మెహిదీపట్నం, నవంబర్ 30 : ఫోన్లు పోగొట్టుకున్న 24 మందికి గోల్కొండ పోలీసులు శనివారం సాయంత్రం వారికి అప్పగించారు. ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ సైదులు, సిబ్బంది సాంకేతిక అధారాలతో స్వాధీనం చేసుకొని తిరిగి గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో వారికి అందించినట్లు తెలిపారు.

శాశ్వత ప్రాతిపదికన నాలా పైకప్పు నిర్మించండి..

- గోషామహల్‌లో కూలిన నాలా మరమ్మతులు చేపట్టిన అధికారులు
- వాహనాల రాకపోకలతో మళ్లీ కూలిపోతుందేమోనని స్థానికుల ఆందోళన
- భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని వినతి

అబిడ్స్, నవంబర్ 30 : గోషామహల్ ప్రాంతంలో కుప్ప కూలిన నాలాకు చేపట్టిన మరమ్మతు పనులను శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గంతంలో మాదిరిగా కాకుండా మళ్లీ కూలిపోకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు. నాలాపై నుంచి భారీ వాహనాలు వెళ్తుండ టంతో తరచూ పైకప్పు కూలి పోతున్నదని పేర్కొంటున్నారు. ఇప్పటికే రెండు సార్లు కూలి పోయినా అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలా పైకప్పు కూలిపోవడంతో అప్పటి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని వెంటనే నాలా పైకప్పు నిర్మించడంతో పాటు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అప్పుడు నిర్మాణ పనులను చేపట్టి వాహనాల రాక పోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు. కానీ మళ్లీ అక్టోబర్ 23న అదే నాలా పై కప్పు కూలిపోయింది. దీంతో అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు చేయగా జీహెచ్ ఎంసీ కమిషనర్ ప్రత్యేక బడ్జెట్ ద్వారా రూ 2 కోట్ల నిధులను విడుదల చేశారు. దీంతో పనులను ప్రారంభించారు.

యుద్ధ ప్రతిపాదికన పనులను పూర్తి చేయాలి..

గోషామహల్ చాక్నావాడి నాలా పైకప్పు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కప్పుపై నుంచి భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో కూలి పోతోందని, దాంతో మరమ్మతు పనులను చేపడుతున్నారని పేర్కొంటున్నారు. మున్ముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు భారీ వాహనాలు వెళ్లకుండా గ్యాడర్‌ల నైనా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

గోషామహల్ చాక్నావాడిలో జరుగుతున్న నాలా మరమ్మతు పనులు

'సమ్మాన్యుడు' పుస్తకావిష్కరణ

సమ్మాన్యుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 30. సిరివెన్నెల సీతారామశాస్త్రి విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగించిన కర్మయోగి అని వక్తలు శ్లాఘించారు. అక్షజ్ఞ పబ్లికేషన్ ఆధ్వర్యంలో సిరివెన్నెల సుమధుర జ్ఞాపకాలతో కూడిన కార్యక్రమం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం ఆద్యంతం సిరివెన్నెల సీతారామశాస్త్రి జీవిత విశేషాలతో సాగింది. రచయిత చేబోలు శ్రీరామశాస్త్రి సంకలనం చేసిన సిరివెన్నెల తొలిగురువు 'సమ్మాన్యుడు' పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు. ఏపీ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, రచయితలు, పాత్రికేయులు ఎంవీఆర్ శాస్త్రి, గుండు వల్లీశ్వర్, వైద్యులు డాక్టర్ పన్నాల కృష్ణ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కేవీఎస్ఎస్ఆర్‌కే శాస్త్రి, కౌముది అంతర్జాల పత్రిక సంచాలకులు కిరణ్ ప్రభ, చలనచిత్ర దర్శకులు కృష్ణవంశీ పాల్గొన్నారు. సిరివెన్నెల రచనలోని పలు గీతాలను పలువురు గాయనీగాయకులు శ్రావ్యంగా ఆలపించి సంగీతప్రియులను అలరించారు.

వైజ్ఞానిక ప్రదర్శన

ఇన్నోవిస్టా-2024 వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలు, నమూనాలను ప్రిన్సిపాల్ షాజహాన్ ఆంటోనీ, శాస్త్రవేత్త డాక్టర్ ఈవీఎస్‌కే బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ నమూనాలను రూపొందించిన విద్యార్థులను ప్రశంసించారు.

– అబిడ్స్, నవంబర్ 30

సుజాతకు మధుర గాయని పురస్కారం

సినీ నేపథ్యగాయని సుజాతకు ప్రాజ్ఞిక-సీల్‌వెల్ బహుముఖ మధుర గాయని పురస్కారాన్ని అందజేస్తున్న సంగీత దర్శకుడు రాధాకృష్ణ తదితరులు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 30 : ప్రాజ్ఞిక ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్ సంస్థల ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో శనివారం జానకమ్మ స్వరవైభవం శీర్షికన నిర్వహించిన సంగీత విభావరి ఆద్యంతం సంగీత ప్రియులను ఓలలాడించింది. సినీ నేపథ్యగాయని సుజాత ప్రముఖ గాయని జానకమ్మ ఆలపించిన 35 మధుర గీతాలను ఆలపించి రసజ్ఞులైన సంగీత ప్రియుల కరతాళధ్వనులందుకున్నారు. అనంతరం జరిగిన సభలో సుజాతకు ప్రాజ్ఞిక-సీల్‌వెల్ సభ్యులు బహుముఖ మధుర గాయని అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ సంగీతదర్శకులు కేఎం రాధాకృష్ణ, సింగర్ సింహ పాల్గొని జానకమ్మ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ప్రాజ్ఞిక వ్యవస్థాపకులు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి సుజాత, గాయకులు సిద్ధు, సురేశ్, వెంకీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్వాన్‌లో జోరందుకున్న బీఆర్ఎస్

నియోజకవర్గ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్

మెహిదీపట్నం, నవంబర్ 30 : ప్రజలకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అందించిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేసిందని, కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ తిరిగి జోరందుకుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్ సింగ్ అన్నారు. శనివారం లంగర్‌హౌస్‌లో జీవన్‌సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను అబివృద్ధి పరంగా నాశనం చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పూర్వవైభవం సాధించేందుకు శాయశక్తులా కృషిచేస్తానని జీవన్‌సింగ్ పేర్కొన్నారు.

గుంతల రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టండి..

ఆబిడ్స్ : గోషామహల్ నియోజకవర్గంలోని ఇంజ్లి గల్లీ, పత్తార్‌కీ మసీద్, పూసల బస్తీ, జాంబాగ్, సిక్ గల్లీ తదితర ప్రాంతాల్లో గుంతలమయమైన రోడ్లను శనివారం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. తక్షణమే ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని ఆయన సంబంధిత శాఖల అధికారులను కోరారు.

గుడిమల్కాపూర్ మార్కెట్‌లో పర్యటించిన ఎమ్మెల్యేలు

గుడిమల్కాపూర్ పూలమార్కెట్‌లో పర్యటిస్తున్న కార్వాన్, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్‌మొహినుద్దీన్, మాజీద్ హుస్సేన్

మెహిదీపట్నం, నవంబర్ 30 : నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ పి. ఇంద్రారెడ్డి పూలమార్కెట్‌లో శనివారం కార్వాన్, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్‌మొహినుద్దీన్, మాజీద్ హుస్సేన్‌లు పర్యటించారు. పూల మార్కెట్‌లో గతంలో కూల్చిన దుకాణాల స్థానంలో తిరిగి దుకాణాలను ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యేలు చిరు వ్యాపారులతో చర్చించారు. దుకాణాలను కోల్పోయిన వారు కోర్టు నుంచి నాట్ టు ఎంటర్ ఫేర్ ఆర్డర్ తెచ్చికొని దుకాణాలను పెట్టుకున్నారు. వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయవద్దని పోలీసులు, మార్కెట్ అధికారులకు ఎమ్మెల్యేలు సూచించారు.

క్రీడలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి

మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య

అంబర్‌పేట, నవంబర్ 30 : క్రీడలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య సూచించారు. డీడీ కాలనీ, నల్లకుంట, గాంధీనగర్, హిమాయత్‌నగర్ బ్రాంచీల బచ్‌పన్ స్కూల్స్ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ డీసీపీ నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే చదువుకు సార్థకత ఏర్పడుతుందని సూచించారు. శారీరక దృఢత్వాన్ని పెంచడానికి క్రీడలు మరింత ఉపయోగపడుతాయన్నారు.

కార్యకమంలో రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి, కౌశిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ, ఆర్.యామిని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వేగవంతం చేయాలని బైక్ ర్యాలీ

బైక్ ర్యాలీలో పాల్గొన్న మేడి పాపయ్య, పులిజాల గెల్వయ్య తదితరులు

అంబర్‌పేట, నవంబర్ 30: తరతరాలుగా అనుభవిస్తున్న ఎస్సీ రిజర్వేషన్లను కొంత మంది మాల వ్యతిరేక శక్తులు ఏబీసీడీలు కాకుండా అడ్డుకుంటున్నాయని ఎమ్మార్పీఎస్ ఆరోపించింది. ఎస్సీ వర్గీకరణ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఎమ్మార్పీఎస్ అధిష్టానం పిలుపుమేరకు శనివారం భారీ ఎత్తున బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి గంట సుదర్శన్, వర్కింగ్ ప్రసిడెంట్ బోడ రవికిరణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ పులిజాల గెల్వయ్య, కృపాకర్, మంచాల యాదగిరి, బాచుపల్లి యాతగిరి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహాపడిపూజ



కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ బాపూనగర్ స్తంభాల మైసమ్మ ఆలయంలో శనివారం అయ్యప్ప స్వామి మహాపడిపూజ నిర్వహించారు. కన్నె స్వామి వివేకానందరెడ్డి, గదస్వామి సాంబశివ ఏర్పాటు చేసిన పూజను గురుస్వాములు కారింగుల గోపీగౌడ్, ఉదయ్‌గౌడ్ మంత్రాలు, అభిషేకాలతో పూర్తి చేశారు. ఈ పూజా కార్యక్రమంలో గురుస్వాములు దండోతికార్ సంతోష్‌కుమార్, కారింగుల శ్రీనివాస్‌గౌడ్, బి.శ్రీనివాస్‌గౌడ్, గదస్వామి జతిన్, గంట స్వాములు హార్దిక్, సాయిశశాంక్, కత్తి స్వాములు రాజు గౌడ్, శ్రీనివాస్, శ్లోక్‌గౌడ్, అక్షిత్ గౌడ్, కన్నె స్వాములు విక్రాంత్, దీపక్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, నవంబర్ 30

వేర్వేరు చోట్ల రైలు ఢీకొని ఇద్దరు మృతి

కాచిగూడ, నవంబర్ 30 : వేర్వేరు చోట్ల రైలు ఢీకొని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతిచెందారు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. ఉప్పుగూడ రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి(55) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు గోధుమ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి, 5.5 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు.

మరో ఘటనలో..

పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గుర్తు తెలియని వృద్ధుడు(65) శనివారం ఉప్పుగూడ-యాకుత్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృత దేహాన్ని కాచిగూడ రైల్వే పోలీసులు ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు ఆకుపచ్చ రంగు చొక్కా, తెల్ల ధోవతి ధరించి, 5.2 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9948695948 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గృహిణి అదృశ్యం

కాచిగూడ, నవంబర్ 30: ఫంక్షన్‌కు వెళ్లిన గృహిణి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై పి. రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ దారుషఫా ప్రాంతానికి చెందిన ఎం. రవళి (26)శుక్రవారం చెప్పల్‌బజార్‌లో ఉండే స్నేహితురాలి ఇంటికి ఫంక్షన్‌కు వెళ్లి ఇప్పటికీ తిరిగి రాలేదు. దీంతో కలతచెందిన భర్త సాయివికాస్ శనివారం రాత్రి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రవళి బయటకు వెళ్లిన సమయంలో లేత పింక్ కుర్తా పైజమా, నీలి రంగు చున్నీ ధరించిందని, 5.3 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చెక్కు అందజేత

ఎల్బీనగర్ : సూర్యాపేట జిల్లా ఆత్మకూరుకు చెందిన స్వప్నకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 44 వేల చెక్కును ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా శనివారం కొత్తపేటలోని తన నివాసంలో అందజేశారు.

శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించాలి

కూచిపూడి నాట్యకారిణులతో వక్తలు

రవీంద్రభారతి, నవంబర్ 30 : శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించడం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత రంగస్థలం అకాడమీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 30 రోజుల సైద్ధాంతిక కూచిపూడి నాట్య శిక్షణ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వక్తలుగా నాట్యగురువులు సంగం భట్ల నరసయ్య, ఇందిరాహేమ, సీహెచ్ నారాయణమూర్తి, నాట్య మార్గం పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకున్నది.

కరాటే పోటీల్లో ఫరీదాసుల్తానాకు కాంస్యం

ఆబిడ్స్ : సౌతాఫ్రికాలోని డర్బన్‌లోని ఓలీవ్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన 11వ కామన్వెల్త్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఫరీదా సుల్తానా కాంస్య పతకం సాధించింది. కరాటే ఇండియా అధ్యక్షుడు హంషి భరత్ శర్మ, కరాటే డో అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ తదితరులు ఈ సందర్భంగా ఫరీదా సుల్తానాను ప్రశంసించారు. మరిన్ని పతకాలు సాధించాలని అభిలషించారు.

'విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు'

కందుకూరు, నవంబర్ 30: సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకుడు సిద్ధు విమర్శించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కందుకూరులో విద్యా సంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. వరుస సంఘటనలు జరుగుతున్న ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్లు లేదని తెలిపారు. బాధ్యులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్య ప్రైవేటీకరణకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులను కల్పించాలని కోరారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలి

కందుకూరు. నవంబర్ 30 : రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలని రంగారెడ్డి జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సురేశ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మామిడి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పండ్ల తోటల రైతులకు పట్టుపరిశ్రమ, ఉద్యాన వనశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పూత దశలో మామిడి తోటలో తీసుకోవాల్సిన జాగ్రతలపై రైతులకు సూచించారు. కూరగాయల పంటలలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసుకున్నట్లయితే నాలుగేండ్ల అనంతరం ఎకరాకు ఐదు వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. డ్రిప్, స్ప్రింకర్లను రాయితీపై ఇస్తుందని తెలిపారు. సీఆర్ఐడీ సైంటిస్టు శ్రీకృష్ణ, మండల ఉద్యానవన అధికారి సౌమ్య, వ్యవసాయ అధికారి కృష్ణమోహన్, ఏఈఓ రాజు, ప్రమోద్, మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

ట్రేడ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి, నవంబర్ 30: తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రెహమాన్ బాబా సంస్థ నిర్వహిస్తున్న ట్రేడ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ వాల్‌పోస్టర్‌ను శనివారం రవీంద్రభారతిలోని ప్రాంగణంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలుగు వారాల పాటు జరిగే ఈ వర్క్‌షాప్ ఔత్సాహిక, బిగినర్స్ అమెచ్యూర్, మరియు మిడ్ ప్రొఫెషనల్‌కు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగపంగ ప్రభాకర్, ఒగ్గు రవి, యూనస్ ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు. ఆసక్తి గలవారు 9949303111 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆసిఫ్‌నగర్‌లో నాంపల్లి ఎమ్మెల్యే పర్యటన

నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో శనివారం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ పర్యటించారు. ఈ సందర్భంగా చోటిమసీద్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులను అందిస్తున్నామన్నారు.

– మెహిదీపట్నం, నవంబర్ 30

ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌కు పితృవియోగం

మక్సూద్ (ఫైల్)

మెహిదీపట్నం, నవంబర్ 30 : నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ తండ్రి ఎంహెచ్ మక్సూద్ (88) శనివారం రాత్రి మాసాబ్ ట్యాంక్ అహ్మద్‌నగర్‌లోని తన స్వగృహంలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మాజీద్ హుస్సేన్ తండ్రి గతంలో ఏపీ హ్యాండ్‌బాల్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. మాజీద్ హుస్సేన్‌ను శనివారం రాత్రి హైదరరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, అక్బరొద్దీన్‌తోపాటు పలువురు ఎంఐఎం ఎమ్మెల్యేలు పరామర్శించారు. ఆదివారం మక్సూద్ అంత్యక్రియలు అహ్మద్‌నగర్‌లోని అహ్మద్ బాదేపా దర్గా ఆవరణలో జరుగుతాయని తెలిపారు

ఎంఫార్మసీ పరీక్షల తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 7 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.